ఘనంగా శ్రీవారి గ్రామోత్సవం


రేగడపల్లిలో శ్రీవారి గ్రామోత్సవం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటిదశిని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి అత్యంత భక్తిశ్రద్ధలతో వెంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ వేదపండితులు విజయకాంత్ శర్మ ఆధ్వర్యంలో ఉభయదాతలు పాల్గొని కల్యాణాన్ని జరిపించారు. ముందుగా ఆలయంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు నిర్వహించగా భక్తులు వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని పునీతులయ్యారు. పుష్య మాసం శనివారం సందర్భంగా మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శ్రీవారిని దర్శించుకొని పునీతులయ్యారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి


బీసీ భవన్‌లో ఓబన్నకు నివాళులర్పిస్తున్న నాయకులు

మార్కాపురం: బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వడ్డె ఓబన్న అందరికీ ఆదర్శనీయుడని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వైఎస్సార్ సీపీ నేత పిన్నిక లక్ష్మిప్రసాద్‌యాదవ్ అన్నారు. శనివారం బీసీ భవన్‌లో వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అనుచరుడుగా బ్రిటిష్‌వారిపై తిరుగుబాటుచేసి స్వాతంత్ర్యం కోసం ప్రజల పక్షాన పోరాటం చేశారన్నారు. వారికి వ్యతిరేకంగా దండయాత్రలు, ఉద్యమాలు చేసిన వడ్డె ఓబన్న చిరస్మరణీయుడన్నారు. బీసీ భవన్ అధ్యక్షులు గోసు సుబ్బారావు, బీసీ సంఘాల నాయకులు రాచకొండ శ్రీనివాసులు, సీహెచ్ పురుషోత్తమ్, గజ్జ రమణ, కె. నాగార్జున, వంకేశ్వరం శ్రీనివాసులు, మండ్ల శ్రీనివాసులు, మెట్ల చెంచయ్య, పిన్నిక చక్రపాణి, నాగం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జార్జి కళాశాలలో..

డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో వడ్డే ఓబన్న జయంతి, లాల్ బహదూర్‌శాస్త్రీ వర్ధంతిని ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు, అకడమిక్ డీన్ డాక్టర్ మస్తానయ్య ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వడ్డె ఓబన్న 218వ జయంతి వేడుకలను సీపిఐ కార్యాలయంలో దేవండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆయన పోరాట పటిమను గుర్తుచేసుకున్నారు.

ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం పాఠశాలల కరస్పాండెంట్ మృతి


మృతి చెందిన బి. నారాయణ రెడ్డి(ఫైల్)

కొమరోలు : ఎస్‌బీ ఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలల అధినేత బందుగుల నారాయణ రెడ్డి (70) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. మండలంలోని గోపాలునిపల్లె గ్రామానికి చెందిన బందుగుల నారాయణరెడ్డి 10 రోజులక్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో కర్నూలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. కాగా ఎస్‌బీ ఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలల శాఖలు మండలంలోని కొమరోలు, కొత్తపల్లి, ఓబులాపురం, రామావారిపల్లి, శివాజీనగర్ గ్రామాల్లో నెలకొల్పి గత 40 సంవత్సరాలుగా ఉచిత విద్యను అందించారు. కాగా ఆయన అకాల మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతలను ఆదుకోండి

గిద్దలూరు రూరల్: గడ్డి మందు కొడితే శనగ పంట దెబ్బతిని నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. మండలంలోని వెంగళరెడ్డిపల్లె, వెల్లుపల్లె గ్రామాల్లో నవంబర్ 25న రైతులు వారి పంట పొలంలో గడ్డి పోవడానికి మందు కావాలని విజయ ఫెర్టిలైజర్ షాపులో మందు కొనుగోలు చేసి శనగ పంటలో పిచికారీ చేశారు. దీంతో శనగ పంట దెబ్బతిని నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. నాయకులు శనివారం వారి పంట పొలాలను పరిశీలించారు. రైతులను మోసం చేసి నకిలీ మందులు విక్రయించిన ఫెర్టిలైజర్ షాపు లైసెన్సు రద్దు చేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజా ఉద్యమాలు తప్పవదని వారు హెచ్చరించారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి


రైల్వే అధికారులకు గేటు సమస్యను వివరిస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్లగేటు వద్ద గల రైల్వే ఓవర్ బ్రిడ్జిని త్వరితగతిన నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు శనివారం రైల్వే గతి శక్తి అసిస్టెంట్ డివిజన్ అధికారులు ఎం.జగన్‌మోహన్‌రావు, తిరుమలరావులను కంభం రైల్వే పనుల్లో కలిసి సమస్యను వివరించారు. రాచర్ల గేటు వద్ద గిద్దలూరు ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రజల సమస్యలను గుర్తించి రైల్వే ఓవర్ బ్రిడ్జి అవసరంపై ప్రత్యేక నివేదికలు తయారుచేసి రైల్వేశాఖ ఉన్నతాధికారులకు తెలియజేయాలని వారు కోరారు. గిద్దలూరు పట్టణ ప్రజల చిరకాల కోరిగా రాచర్లగేటు రైల్వే ఓవర్ బ్రిడ్జి అలాగే ఉండిపోయిందని వారి సమస్యను వివరించారు. బీజేపీ నాయకులు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్, డాక్టర్ జేవీ నారాయణ, ఖాదర్‌వలి, షఫీ, బాదం మనోహర్, పల్లెం శ్రీనివాసులు, శివనాగేంద్ర, సంజీవులు, చెన్నకేశవులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన గురవయ్య


గాయపడిన గోపీరామ్

బేస్తవారిపేట: మండలంలోని పెద్ద ఓబినేనిపల్లె సమీపంలో మోటార్‌సైకిల్, కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం జరిగింది. మార్కాపురం మండలం బొందలపాడుకు చెందిన కేతు బోయిన గురవయ్య, ఎం. గోపీరాం.. మోటార్‌సైకిల్‌పై మెటల్ రోడ్డు నుంచి ఒంగోలు-నంద్యాల హైవేరోడ్డు ఎక్కే సమయంలో ఒంగోలు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న గురవయ్య, గోపీరాంల కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సిబ్బంది కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మార్కాపురం టౌన్: మున్సిపల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కాంట్రాక్టు కార్మికులకు పారిశుద్ధ్య కార్మికులతో సమానంగా వేతనాలను పెంచాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ)రాష్ట్రకమిటీ పిలుపు మేరకు శనివారం ధర్నా నిర్వహించారు. సందర్భంగా సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి రూబెన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వేతనాలు పెంచాలన్నారు. జి. హరికృష్ణ, ఎ. వెంకటరమణ, కనకయ్య, అల్లూరయ్య, సాయిరెడ్డి, టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హరికుమార్ యాదవ్‌కు సత్కారం


హరికుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న పీఎల్‌పీ

కొనకనమిట్ల: వెలుగొండ క్షేత్రంలోని శ్రీకృష్ణ యాదవ అన్నదాన సేవా సంస్థ నూతన అధ్యక్షుడు పిన్నిక హరికుమార్ యాదవ్‌ను శనివారం యాదవ అన్నసత్రంలో నియోజకవర్గంలోని యాదవ ప్రముఖులు, బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నూతనంగా ఎన్నికైన అన్నదాన సత్రం అధ్యక్షుడు హరికుమార్ యాదవ్ మాట్లాడుతూ తాను సత్రాభివృద్ధికి పాటుపడతానన్నారు. ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. అనంతరం హరికుమార్ యాదవ్‌ను పిన్నిక లక్ష్మీప్రసాద్ యాదవ్, అన్నదాన సేవా సంస్థ సభ్యులు పూలమాలతో ఘనంగా సన్మానించారు.

వెలుగుల సంక్రాంతి

- మొదలైన గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు
- పల్లెల్లో ముందస్తు వేడుకలు

కొనకనమిట్ల: తెలుగు ప్రజల జీవన శైలికి అద్దం పట్టే ధనుర్మాసం రాక... చలిపులితో గిలిగింతలు.. పొగ మంచు దుప్పట్లు పరుచుకుని పక్షుల కిలకిల రావాలు ప్రతిధ్వనిలో సంక్రాంతి శోభ నియోజకవర్గంలో ప్రారంభం అయింది. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు వినిపిస్తున్నారు. పల్లెలో మందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుతున్నారు. గతంలో అయితే గంగిరెద్దులతో సీతారాముల కళ్యాణం, ఆంజనేయస్వామి రాయభారం వంటి సన్నివేశాలు పల్లె ప్రజలకు తీయని అనుభూతి అందేది. గజగజలాడించే చలిని లెక్కచేయకుండా వృద్ధులు మొదలుకొని పిల్లలు గంగిరెద్దుల విన్యాసాలు తిలకించేవారు. ప్రస్తుతం మాత్రం వారు భిక్షాటనకే పరిమితం అయ్యారు. మహిళలు రంగ వల్లులను తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం జీవన శైలి మారింది. ఇంటింటా బుల్లి తెరలు, ఫోన్లు చూస్తూ ఆనందిస్తున్నారు. కానీ మూడు రోజుల పండగ మాత్రం ఆనందంగా చేసుకుంటారు. ఇప్పటికే దూరప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకున్నారు.


వెలుగొండలో సంక్రాంతి సంబరాలు


చిన్నారుల గాలిపటాల సందడి


భోగిమంటలు వేస్తున్న అన్నా కృష్ణచైతన్య

సంప్రదాయాలను గౌరవిద్దాం

మార్కాపురం: పట్టణంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో శనివారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ అన్నా కృష్ణచైతన్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల మధ్య భోగిపళ్లు పోసి, భోగి మంటలు వేశారు. ముగ్గులు, హరిదాసుల వేషాలు, కోలాట ప్రదర్శనలతో సందడి వాతావరణం నెలకొంది. ప్రిన్సిపాల్ డాక్టర్ వెన్న కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రంగనాయకులు, ఎంఎస్ఎస్ పీఠ అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జార్జి కళాశాలలో..

డాక్టర్ సామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా ప్రిన్సిపల్ రాజబాబు మాట్లాడుతూ ఈ సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగులు తేవాలని కళాశాల టెక్నికల్ అడ్వయిజర్, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సందేశంలో పేర్కొన్నారు.


సంబరాల్లో అన్నా కృష్ణచైతన్య, సిబ్బంది


ధాన్యం తూర్పార పడుతున్న రైతులు

అప్పటి రోజులే వేరు



అప్పటికి ఇప్పటికి చాలా మారింది. సంకురాత్రి నెల పెట్టగానే ఊర్లల్లో సందడి ఉండేది. నెల రోజుల పాటు గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల భజనలతో ఊరంతా సంక్రాంతి అన్నట్లు ఉండేది.. భోగినాడు అలసందలతో పులగం, పెద్ద పండగ నాడేమో సామ బియ్యంలో బెల్లం కలిపి పాశం చేత్తాము. కనుమ నాడు రాగిసంగటి, నాటుకోడి మాంసం తినేవాళ్లం. భోగి నాడు పులగంలోకి చిక్కుళ్లతో కూర చేత్తే బాగుండేది. మా చిన్నప్పుడు ఊర్లోవాళ్లమంతా ఒకచోట చేరి చలి మంటలు వేసేవాళ్లం. ఆరిక, సామ, వరిగ, కొర్ర, జొన్న పంటలు ఇళ్లకు చేరుతుంటే సంబరంగా ఉండేది. భోగి పండగ నాడు అందరి ఇళ్లల్లో ఆరిక బువ్వ, అలసంద బ్యాళ్లు, సామ బువ్వ, పెసర బ్యాళ్లతో చేసిన పులగం, గుమ్మడికాయ కూరతో ఆడోళ్లు వండి పెట్టేవోళ్లు..

– నాగం కొండమ్మ (99), గొట్లగట్టు

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస హోమాలు

మార్కాపురం టౌన్: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో గత 10 రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో భాగంగా శనివారం మందిరంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణాన్ని ఎక్కువ సార్లు చదివిన యక్కలి సరోజ, కనక సుబ్బులు, పేరం సీతారావమ్మకు వెండి కాయిన్స్‌ను బహూకరించారు. పీవీఎల్ఎస్ నాగరాజు, రామడుగు గోపి తదితరులు పాల్గొన్నారు.


హోమాల్లో పాల్గొన్న భక్తులు

గోదాదేవికి పాయసం నివేదన

మార్కాపురం టౌన్: ధనుర్మాసం సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. శనివారం శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయం, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి, గుండ్లకమ్మ నదీ ఒడ్డున ఉన్న శ్రీ లక్ష్మి పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి కూడార్వై 27వ పాశురం విశేష పూజలను నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి 108 గంగాళలతో పాయసం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.



చెన్నకేశవ స్వామి, ఆలయంలో 108 గంగాళాలతో నైవేద్యం